నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 27 మార్చి 2024 | KHAMMAM

కవితపై తప్పుడు కేసు బనాయించారు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, మార్చి 26 : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఈడీ అధికారులు తప్పుడు కేసు బనాయించి విచారిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కవితను జైలుకు పంపడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ మంగళవారం ఢిల్లీలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కవితకు ఏ మాత్రం సంబంధం లేనప్పటికీ రాజకీయ దురుద్దేశంతో కేసుపెట్టి జైలుకు పంపడం బాధాకరమన్నారు. కవిత బెయిల్ పిటీషన్ ఏప్రిల్ 1న విచారణకు వస్తుందని తెలిపారు. మహానేత కేసీఆర్, ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ ఇలాంటి వాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడదని స్పష్టంచేశారు. లోకసభ ఎన్నికల్లో లబ్ధి పొందాలని బీజేపీ కుట్రలకు పాల్పడుతున్నదని, వాటిని తెలంగాణ ప్రజలు భగ్నం చేస్తారన్నారు. న్యాయవ్యవస్థ పట్ల తమకు అపారమైన గౌరవం, సంపూర్ణ విశ్వాసం ఉందని, కవిత నిర్దోషిగా బయటకు వస్తారని అన్నారు. ఎంపీ వెంట వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్ లాల్ ఉన్నారు.

పంట ధర పతనం!

- మార్కెట్‌లో రోజురోజుకూ పడిపోతున్న మిర్చి రేటు
- తొలిసారిగా క్వింటా ధర రూ.20 వేల దిగువకు..
- చివరి రకం.. నాణ్యమైన సరుకు రాకపోవడమే కారణమంటున్న వ్యాపారులు
- కొందరు అమ్మేందుకు, మరికొందరు నిల్వ చేసేందుకు మొగ్గు

రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 26 : మార్కెట్‌లో ఎర్ర బంగారం ధర నేల చూపులు చూస్తోంది. తెగుళ్లు, వాతావరణ పరిస్థితుల నుంచి ఇన్నాళ్లూ పంటను కాపాడుకుంటూ వచ్చిన రైతులకు తగ్గుతున్న రేటు ఆందోళనకు గురి చేస్తోంది. గత ఏడాది సిరులు కురిపించిన మిర్చి ధర ఈ ఏడాది పంట చివరి దశకు చేరే సమయానికి క్వింటాకు రూ.20 వేల దిగువకు పతనం కావడం.. నిల్వ చేసేందుకు కోల్డ్‌స్టోరేజీల్లో సామర్థ్యం లేకపోవడంతో ఎంతో కొంతకు సరుకును అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాలో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది మిర్చి సాగు రైతులకు ఆశించిన మేర దిగుబడి రాలేదు. గత సంవత్సరం తేజా రకం మిర్చికి క్వింటా రూ.25 వేలు పలకడంతో నిల్వ చేసిన సరుకును రైతులు బయటకు తీసి విక్రయించడంతో కోల్డ్‌స్టోరేజీలన్నీ ఖాళీ అయ్యాయి. అయితే గత ఏడాదికంటే ఈ సంవత్సరం మిర్చికి అధిక రేటు పలుకుతుందని ఆశించిన రైతులకు భంగపాటే మిగిలింది. ఈ ఏడాది గరిష్ఠ ధర క్వింటా రూ.22 వేలు పలికినా.. అది కూడా ఒకటి రెండు రోజులకే పరిమితమైంది. మార్కెట్‌లో పక్షం రోజుల నుంచి ప్రతి రోజూ క్వింటా ధర రూ.100-200 వరకు తగ్గుతూ వస్తోంది తప్ప పెరగడం లేదు. చైనా కంపెనీలకు సంబంధించిన ట్రేడర్లు కొనుగోలు చేయకపోవడం, నాణ్యమైన పంట మార్కెట్‌కు రాకపోవడమే ధరల తగ్గుదలకు కారణమవుతున్నదని వ్యాపారులు, అధికారులు పేర్కొంటున్నారు. మంగళవారం వివిధ జిల్లాల నుంచి రైతులు సుమారు 16 వేల బస్తాలను విక్రయానికి తీసుకొచ్చారు. ఉదయం జరిగిన జెండాపాటలో గరిష్ఠ ధర క్వింటా రూ.19,800 మాత్రమే పలికింది. ఈ ఏడాది ఇదే అత్యల్ప ధర అని మార్కెట్‌కు పంటను తీసుకొచ్చిన రైతులు వాపోయారు.

ఎంతో కొంతకు అమ్ముకుంటున్న రైతులు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పంటను విక్రయానికి తీసుకొచ్చిన రైతులు రెండు రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు చివరి రకం పంట కావడంతో ఖరీదుదారులు ఆశించిన మేర ధర పెట్టడం లేదు. మరోవైపు కోల్డ్‌స్టోరేజీల్లో పంట నిల్వ చేద్దామంటే హౌజ్‌ఫుల్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. దీంతో పంటను విక్రయానికి తీసుకొచ్చిన రైతులు మళ్లీ ఇంటికి తీసుకెళ్లలేక ఎంతో కొంతకు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ఖమ్మం మార్కెట్ పరిధిలో 11 కోల్డ్ స్టోరేజీలు ఉండగా.. వాటిలో సుమారు 13.50 లక్షల బస్తాల సామర్థ్యం ఉండగా.. దాదాపుగా పూర్తిస్థాయిలో నిండిపోయాయి. అయితే మిర్చి చివరి రకం కావడంతోనే వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరుసగా మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు వచ్చినప్పటికి మంగళవారం 16 వేల బస్తాలు మాత్రమే విక్రయానికి రావడం ధరల తగ్గుదలకు కారణంగా తెలుస్తోంది.

ర్యాండమైజేషన్‌ను పూర్తి చేయండి

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్‌ను పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 1,459 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పీవో, ఏపీవోల జాబితా సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు 5,840 మంది సిబ్బంది అవసరం ఉండగా.. 20 నుంచి 30 శాతం రిజర్వ్ సిబ్బందితో కూడిన జాబితాను రూపొందించాలన్నారు. పే స్కేల్, కేటగిరీ ప్రకారం పీవో, ఏపీవో, ఓపీవోల నియామకం చేపట్టాలన్నారు. ఎంపిక చేసిన సిబ్బందికి ముందస్తు సమాచారం అందించి శిక్షణలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బందికి మొదటి విడత శిక్షణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, డీఆర్వో ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాంబాబు, ఏఎస్వో కిశోర్, అధికారులు పాల్గొన్నారు.

తొలిదశ ర్యాండమైజేషన్ పూర్తి

భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల

మాట్లాడుతున్న భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సిబ్బందికి తొలిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని భద్రాద్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. మంగళవారం ఐడీవోసీ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో కలిసి ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బందికి తొలిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 962 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 9 యాక్సిలరీ పోలింగ్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలను రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపించామన్నారు. మొదటి ర్యాండమైజేషన్‌లో భాగంగా 1,401 ప్రిసైడింగ్, 1,401 సహాయక ప్రిసైడింగ్ అధికారులు, 2,827 ఓపీవోలను కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అదనంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియను చేపట్టామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎలక్షన్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, రంగా ప్రసాద్, ఎన్ఐసీ డీఐవో సుశీల్‌కుమార్, డీఎల్ఎంటీ పి.సాయికృష్ణ, ఎన్నికల సిబ్బంది నవీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహార పత్రం అందించిన కేటీఆర్

బీమా పరిహార పత్రాన్ని అందిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఖమ్మం రూరల్, మార్చి 26: బీఆర్ఎస్ సభ్యుడికి మంజూరైన బీమా పరిహార పత్రాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలంలోని గుర్రాలపాడుకు చెందిన జాల సురేశ్ కొద్దికాలం క్రితం మరణించాడు. అప్పటికే అతడికి బీఆర్ఎస్ సభ్యత్వం ఉండడంతో అతడికి రూ.2 లక్షల బీమా పరిహారం మంజూరైంది. దీనిని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు శీలం రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో సురేశ్ కుటుంబ సభ్యులైన జాల రామయ్య, చంద్రమ్మలకు అందజేశారు. తమ కుమారుడు చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమకు బీమా పరిహారాన్ని అందించేందుకు కృషిచేసిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్‌కు బాధిత కటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు

వీసీలో సీఎస్ శాంతికుమారి

వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : యాసంగి కోతలు పూర్తి కావొస్తున్నందున ప్రణాళికాబద్ధంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లు, వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళికలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం కలెక్టర్ ప్రియాంక ఆల సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. జిల్లాలో 1,11,369 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని, వాటి అంచనాలతో 127 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మన జిల్లాకు సమీప పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం విక్రయానికి వచ్చే అవకాశం ఉన్నందున నియంత్రణకు సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఎంఆర్ రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి తేడాలున్నా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లాలో తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. తాగునీటికి ఎక్కడా ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గతంలో మంజూరైన పనుల పురోగతిపై మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ డీఈలు, పబ్లిక్ హెల్త్ ఈఈలు, ఎంపీడీవోలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తామని అధికారులకు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, విద్యాచందన, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి, సివిల్ సప్లై డీఎం త్రినాథ్‌బాబు, జిల్లా సహకార శాఖాధికారి ఖుర్షీద్, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఆలీం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించండి

మామిళ్లగూడెం, మార్చి 26 : యాసంగి వరి కోతల షెడ్యూల్ ప్రకారం జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ధాన్యం కొనుగోళ్లు, వేసవిలో తాగునీటి సరఫరా ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్‌లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మేర ప్యాడీ క్లీనర్లు, వేయింగ్, తేమ యంత్రాలు, ఇతర సామగ్రి సన్నద్ధం చేస్తున్నామన్నారు. వేసవి దృష్ట్యా అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఖరీఫ్ 2023-24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ సకాలంలో పూర్తి చేసే విధంగా రైస్ మిల్లులను పర్యవేక్షిస్తామన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పాలేరు రిజర్వాయర్ నుంచి ఖమ్మం నగరానికి నీటిని సరఫరా ఉన్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు వివరించారు. వీసీలో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు, జడ్పీ సీఈవో వినోద్, డీఆర్డీవో సన్యాసయ్య, డీపీవో హరికిషన్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, డీఎం సివిల్ సప్లై శ్రీలత, ఎఫ్ సీఐ ఆర్ఎం రంగప్రసాద్ నాయక్, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీని నిలువరించేది కమ్యూనిస్టులే...

- మోదీని గద్దెదింపే లక్ష్యంతో కార్యకర్తలు పనిచేయాలి
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచ, మార్చి 26 : రాష్ట్రంలో బీజేపీ అడుగు పెట్టకుండా నిలువరించే సత్తా కమ్యూనిస్టులకే ఉందని, సిట్టింగ్ స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు గెలవకుండా ప్రజలను చైతన్యవంతం చేసి అడ్డుకొని తీరుతామని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం పాల్వంచ చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ పదేళ్ల మోదీ పాలన ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టడంతోనే సాగిందన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు. దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, దేశంలో ఉన్నవాడు మరింత ఉన్నవాడుగా మారుతుండగా పేదలు మాత్రం బీదలుగా, కనీసం రెండుపూటలా తిండి తినలేని దౌర్భాగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. మోదీని గద్దెదింపే లక్ష్యంతో కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీనివాస్, డి.శేషయ్య, వీసం శెట్టి పూర్ణచందర్‌రావు, అడుసుమల్లి సాయిబాబా, వాసిరెడ్డి మురళి పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

పాల్వంచ రూరల్, మార్చి 26 : కిన్నెరసాని, కాచనపల్లి క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాల కొరకు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించారు. 9 క్రీడాంశాల్లో ఈ నెల 5, 6వ తేదీల్లో బ్యాటరీ టెస్టులు నిర్వహించి అర్హత సాధించిన వారిని ఎంపిక చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ప్రతిభ చూపిన బాలబాలికలకు చివరిగా బ్యాటరీ టెస్ట్ నిర్వహించి.. పాల్వంచ మండలం కిన్నెరసానిలో 40 మంది బాలురు, గుండాల మండలం కాచనపల్లిలో 40 మంది బాలికలను ఎంపిక చేస్తారు. అయితే మంగళ, బుధవారాల్లో క్రీడా పోటీలు నిర్వహించి ఆయా క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచిన వారిని 5వ తరగతిలో ప్రవేశానికి అర్హత కల్పిస్తారు. మంగళవారం ఉమ్మడి జిల్లా నుంచి 100 మంది బాలబాలికలు హాజరుకాగా.. వారికి పోటీలు నిర్వహించారు. స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటనారాయణ, నాగేశ్వరరావు, అన్నం వెంకటేశ్వర్లు, బుగ్గా వెంకటేశ్వర్లు, హెచ్ఎం చందు పాల్గొన్నారు.

కమ్ముకున్న చీకట్లు!

- సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అంధకారం
- వెలగని సోలార్ విద్యుత్ దీపాలు
- రూ.85 లక్షలు వృథా

చోరీకి గురైన, ఒరిగిన సోలార్ విద్యుత్ దీపాలు, స్తంభాలు

రామవరం, మార్చి 26 : సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంఖని, సత్తుపల్లిలోని జేవీఆర్ వోసీ, కిష్టారం ఓసీల ప్రభావిత పల్లెల్లో చీకట్లు కమ్ముకున్నాయి. సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన సోలార్ వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. కొత్తగూడెం ఏరియా అప్పటి జీఎం జక్కం రమేశ్ ప్రత్యేక చొరవతో పంచాయతీల్లో అవసరాలకనుగుణంగా సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. సుమారు రూ.85 లక్షల వ్యయంతో 540 సోలార్ వీధి దీపాలను 140 యూనిట్లలో ఏర్పాటు చేశారు. ఒక్కో యూనిట్‌లో 4 స్తంభాలు, నాలుగు లైట్లు, రెండు బ్యాటరీలు, రెండు సోలార్ ప్యానల్ ఉంటాయి. పంచాయతీలకు విద్యుత్ ఆదాతోపాటు నిర్వహణ భారం తగ్గుతుందని ప్రారంభించిన ఈ విద్యుత్ దీపాలు మున్నాళ్ల ముచ్చటగా వెలిగాయి. వర్షాలకు చాలాచోట్ల స్తంభాలు నేలకొరిగాయి. అధికారులు స్పందించి సోలార్ దీపాలు వెలిగేలా చూడాలని పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

రూ.85 లక్షలు వృథా?

సోలార్ విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేసిన సంస్థ మూడు సంవత్సరాలపాటు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టు సంస్థ కనీస ప్రమాణాలను కూడా పాటించకపోవంతో వర్షాకాలంలో చాలా లైట్లు నేలకొరిగాయి. పలుచోట్ల లైట్లను చోరులు ఎత్తుకెళ్లారు. ఆయా పంచాయతీల సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. కార్మికులు చిన్నతప్పు చేస్తేనే సహించని అధికారులు రూ.85 లక్షలు వృథాగా పోతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టెన్త్ కోడింగ్ షురూ..

- స్పాట్ కోసం ఏఈ, సీఈలకు ఉత్తర్వులు జారీ
- సెంటర్‌ను పరిశీలించిన జేడీ సర్వీసెస్ మదన్‌మోహన్
- సెయింట్ జోసెఫ్ కేంద్రంలో స్పాట్ ఏర్పాట్లు

సెయింట్ జోసెఫ్ స్కూల్‌ను పరిశీలిస్తున్న జేడీ సర్వీసెస్ మదన్‌మోహన్

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 26 : పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనంలో భాగంగా కోడింగ్ ప్రక్రియ షురువైంది. ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ కేంద్రంగా స్పాట్‌కి సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖాధికారులు పూర్తి చేస్తున్నారు. జిల్లాకు 2.10 లక్షల సమాధాన పత్రాలను కేటాయించనుండగా.. ఇతర జిల్లాలకు చెందిన పేపర్లు స్పాట్‌కు చేరుకుంటున్నాయి. వీటిని ఇద్దరు సీనియర్ హెచ్ఎంల పర్యవేక్షణలో సోమవారం నుంచి కోడింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 3 నుంచి 12వ తేదీ వరకు స్పాట్ జరగనున్నది.

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖాధికారులు

సమాధాన పత్రాల మూల్యాంకనంలో భాగంగా అసిస్టెంట్ ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లకు సంబంధించి విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతిక, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్ట్‌ల వారీగా స్కూల్ అసిస్టెంట్లు, లాంగ్వేజ్ పండిట్లను అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా నియమించారు. అన్ని సబ్జెక్ట్‌ల కంటే గణితం, సోషల్‌లో అత్యధికంగా ఏఈలను నియమించారు. మండలాలవారీగా సీఈలు, ఏఈల ఉత్తర్వులను ఎంఈవోలకు అందజేశారు. ఎంఈవోల ద్వారా ఉపాధ్యాయులకు అందిస్తున్నారు. స్పాట్‌లో సమాధాన పత్రాలు మూల్యాంకనం చేసేందుకు విద్యాశాఖ నుంచి అన్ని పాఠశాలల్లోని అర్హత కలిగిన ఉపాధ్యాయులకు ఉత్తర్వులు అందజేశారు. ఏటా మాదిరిగానే ఈ విద్యాసంవత్సరం కొందరు ఉపాధ్యాయులు తమ ఉత్తర్వులు క్యాన్సిలేషన్ కొరకు తమకున్న పరిచయాల ద్వారా పైరవీలు చేస్తున్నారు. క్యాన్సిలేషన్‌కు దరఖాస్తు చేసుకునే వారిలో ఎక్కువగా ఆరోగ్యం సహకరించడం లేదంటూ వైద్యుల నుంచి మెడికల్ సర్టిఫికెట్ పొందుపరుస్తున్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షిస్తున్న జేడీ, డీఈవో

పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఉన్నప్పటికీ జేడీ సర్వీసెస్, జిల్లా అబ్జర్వర్ మదన్‌మోహన్, డీఈవో సోమశేఖర శర్మలు స్పాట్ కేంద్రాన్ని సందర్శిస్తున్నారు. పేపర్లు ఎలా భద్రపరచాలి, ఏయే గదుల్లో ఏయే సబ్జెక్ట్‌లకు కేటాయించాలనే అంశాలపై చర్చించారు. మూల్యాంకనంలో ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. పాఠశాల నిర్వహణలో ఉన్నప్పటికీ స్పాట్‌కి ఎలాంటి ఆటంకాలు రాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. స్పాట్‌కి ఖమ్మం జిల్లాతోపాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఉపాధ్యాయులకు విధులు కేటాయిస్తున్నారు. డీఈవో క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.

యంత్రాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించాలి

టెక్నాలజీతో బొగ్గు ఉత్పత్తి పెంచాలి

సమీక్షా సమావేశంలో సింగరేణి సీఎండీ బలరాం

మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం సింగరేణి, మార్చి 26 : బొగ్గు ఉత్పత్తిలో యంత్రాల పని సామర్థ్యాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావుతో కలిసి బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశాల్లో రక్షణ సూత్రాలను పాటించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలకు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించారు. సమావేశంలో అన్నిశాఖల జీఎంలు పాల్గొన్నారు.

రామాలయ ప్రొటోకాల్ కమిటీ ఏర్పాటు

భద్రాచలం, మార్చి 26 : వచ్చే నెలలో శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని దేవస్థానంలో ప్రొటోకాల్ కమిటీని ఏర్పాటు చేశారు. రామయ్యను దర్శించుకునేందుకు వచ్చే ప్రముఖులకు దర్శనంతోపాటు ఆలయ మర్యాదల విషయంలో ఎలాంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో 15 మందికి చోటు కల్పించడంతోపాటు బాధ్యతలు అప్పగించారు. దేవస్థానం ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేద పండితులు హనుమశ్శాస్త్రి, శ్రీమద్రామాయణ పారాయణదారులు ఎస్టీజీ కృష్ణమాచార్యులు, ఎల్ఆర్‌కే ప్రసాద్ తదితరులతోపాటు దేవస్థానం కార్యాలయ అధికారులు కూడా కమిటీలో ఉన్నారు. రామయ్యను దర్శించుకోవడానికి వచ్చే ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం ఆలయ మర్యాదలతోపాటు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు, వేదాశీర్వచనం తదితర కార్యక్రమాలను వీరు పర్యవేక్షిస్తారు.